# 'పిపాస' (నాటిక)

రచన
మాడభూషి దివాకర బాబు

# "పిపాస"

దృశ్యం 1

స్పాట్‌లైట్ పడింది. ఆ వెలుగులో ఒక స్త్రీ, పురుషుడు వున్నారు...

ఆ స్త్రీ రకరకాల నృత్య భంగిమల్లో అడుగుతోంది.
స్త్రీ : ఓయీ పురుషుడా... ఏం కావాలి నీకు?
నా అధరాలు కావాలా.. నా కపోలాలు కావాలా..
నా ఉరోజములు కావాలా.. నా ఊరువులు కావాలా..
నా ఓర్పు కావాలా.. నా కూర్పు కావాలా..
నా లావణ్యం కావాలా.. నా నైపుణ్యం కావాలా..
నా హాసం కావాలా.. నా లాస్యం కావాలా..
నా నేతృత్వం కావాలా.. నా దాసత్వం కావాలా..
నా మాతృత్వం కావాలా.. నా శతృత్వం కావాలా..
నా ప్రణయాలు కావాలా.. నా ప్రళయాలు కావాలా..
మొహమాటమేలనోయీ.. చెప్పవోయీ..
నా మనసాలయం కావాలా.. నా మదనాలయం కావాలా?
పురుషుడు ఒక మోకాలు మీద వొంగి అంజలి ఘటిస్తూ
పురుషుడు : అమ్మా.. నాకు నీ స్తన్యం కావాలి... (స్త్రీ నవ్వింది...)
పురుషుడు : అమ్మా.. నాకు నీ స్తన్యం కావాలి.. (స్త్రీ నవ్వుతోంది..)
నవ్వుతూనే వుంది. తెరలు తెరలుగా అమె నవ్వు అంతటా ప్రతిధ్వనిస్తోంది.

Lights off...

## దృశ్యం 2

సుదర్శనం ఇల్లు / ఉదయం

పక్షులు కిల కిలా రావాలు వినిపిస్తున్నాయి. పచ్చగా గుబురుగా వున్న తులసి మొక్క మీద స్పాట్ లైట్ పడింది.
ఆహ్లాదకరమైన నేపధ్య సంగీతం... వెలుతురు నెమ్మదిగా రంగస్థలం అంతా ఆక్రమించుకుంది. తులసి కోటకి పసుపూ కుంకుమ పెడ్తోంది మహాలక్ష్మి..
ఒక పక్క సచిత్ ల్యాప్ టాప్ చూసుకుంటున్నాడు తదేక దీక్షతో!
మరో పక్కనుండి స్నానం సగంలో వొంటి నిండా, తల నిండా సబ్బు నురగతో టవల్ కట్టుకుని వున్న సుదర్శనం వచ్చాడు. తిన్నగా వచ్చి మహాలక్ష్మి పక్కన నిలబడ్డాడు.
అతన్ని మహాలక్ష్మి గమనించలేదు.. విసుగు, అలకతో వెళ్ళి సచిత్ పక్కన నిలబడ్డాడు..

క్షణం తర్వాత యధాలాపంగా సుదర్శనాన్ని చూసిన సచిత్ అదిరి

పడ్డాడు. పెద్ద కేకతో కుర్చీ లోంచి
కింద పడినంత పని చేసాడు..

ఆ కేకకి మహాలక్ష్మి వాళ్ళని చూసింది.
సచిత్ అరుపుకి సుదర్శనం కూడా
కంగారు పడిపోయాడు.

సుద : వొరేయ్.. నేన్రా నాన్నని...

సచి : అర్థమైంది.. ఏంటి నాన్న చిన్న
పిల్లాడిలా... హడలిపోయాను

మహా : ఇంతోటి దేహానికి ఇన్ని సోకులెందుకని...
వొళ్ళంతా ఆ సబ్బు పట్టించడం ఏంటి?
ఇలా వచ్చి ఈ అర్థనగ్న ప్రదర్శన ఏంటి?
రాన్రా నూ...

సుద : ఏం చెయ్యమంటావ్ మహాలక్ష్మి జలకా
లాడుతుండగా సగంలో
నీళ్ళయిపోయాయి..

సచి : అదేంటి మొన్నేగా ట్యాంకు
పోయించుకున్నాం.. అప్పుడే
అయిపోయాయా...

సుద : అప్పుడే అయిపోయాయా.. నేనూ
అదే అడుగుతున్నాను..

మహా : ఇవాళ శుక్రవారం కదా అని ఇల్లు కడిగించాను...
అదీగాక ఇంత మందిమి
అయిపోవా ఏంటి?

సుద : అవును అయిపోవా ఏంటి?

సచి : నాన్నా... నేను చెప్పిన దానికీ
అవునంటావ్-అమ్మ చెప్పిన దానికీ
తలూపుతావ్... నువ్వు స్వంతంగా
ఆలోచించవా...

సుద : నాన్నా నేను మాసు...

మురిపెంగా అంది..

మహా : ఏంకాదు మీరు క్లాసయితేనూ...

సుద : మాస్ అంటే అది కాదే. జనసమూహం.
ఎవరు గట్టిగా వాదిస్తే వాళ్ళకి జై
అంటాం..

మహా : ఇంతోటి విషయానికి ఇన్ని
వివరాలెందుకని... వెళ్ళి స్నానం
చెయ్యండి..

సుద : నో వాటర్ కదే..

మహా : ఏరా వాటర్ ట్యాంకర్ కి ఫోన్ చెయ్య
మన్నాను. చెయ్యలేదా?

సచి : చేశానమ్మా ఈ పాటికి వచ్చేయాలి..

(తెరలో నుండి ఓ గొంతు)

ఓబివి : అమ్మా.. వాటర్

సచి : అదిగో వచ్చాడు ..

మహా : ఇహనేం.. వెళ్ళి సంపులో పోయించు..

సచిత్ వెళ్ళాడు ఒక పక్కకి...

మీరూ దయ చెయ్యండి... సిక్స్‌ప్యాక్ చూడలేక చస్తున్నాం..

సుదర్శనం వెళ్ళాడు...

వూ...

గదిమింది...
సుదర్శనం లోపలికి వెళ్ళాడు..
మళ్ళీ తులసి కోట దగ్గర తన పనిలో పడింది మహాలక్ష్మి...
ఇప్పుడు మేడ మెట్లు దిగుతూ... సత్యం దగ్గుతూ, తుమ్ముతూ వచ్చాడు...
మనిషి చాల సాఫ్ట్ గా వున్నాడు...

మహా : ఏంటి సత్యం ఒంట్లో బాగాలేదా?

సత్యం : ఎలా వుంటుందండీ.. ఒక పక్క కలప దుకాణం.. సా మిల్.. శబ్దాలు.. రంపపు పొట్టు.. పోనీ అటు కిటికీ మూసి ఇటు కిటికీ తెరిస్తే ఆటో మొబైల్ వర్క్‌షాప్.. శబ్దాలు. పెట్రోల్ డీజిల్ వాసనలు.. హారిబుల్.. ఎలా వుంటున్నారండీ ఈ ఇంట్లో..

మహా : ఇంతోటి అద్దెకున్న నీకే ఇన్ని వంకలుంటే ఓనర్స్‌మి.. మేమేం అనుకోవాలి. నువ్వూ వద్దు నువ్విచ్చే బోడి అద్దె వద్దు.. వెంటనే ఇల్లు ఖాళీ చేసేయ్...

సత్యం : అదేంటోనండీ అందరూ సత్యం నీ పేరు బావుందోయ్ అంటారండి.. కానీ నేనేం చెప్పినా ఎవరికి నచ్చదండి. సత్యం చెప్పడం వల్ల  నచ్చడం లేదా? సత్యాన్ని అనబడే నేను చెప్పడం వల్ల నచ్చడం లేదా? అర్ధం కావడం లేదండీ..

మహా : నాయనా సత్యం.. నువ్వు గది ఖాళీ చెయ్యక్కర్లేదు కానీ పొద్దున్నే ఏంటేంటో మాట్లాడి కంగారు పెట్టకు.

సత్యం : అంటేనండీ..

అని ఏదో చెప్పబోతుండగా
పద్నాలుగేళ్ళ చిక్కు గెంతుతూ వచ్చింది.

చిక్కు : అమ్మా.. అమ్మా..

సత్యాన్ని చూసి..

చిక్కు : హాయ్.. తుమ్మూ.. దగ్గు... హౌ ఆర్ యూ టుడే..

సత్యం : అంటేనండీ..

| | | |
|---|---|---|
| | మహా : | చిక్కూ వూర్కో. |
| | మహా : | సత్యం బాబూ.. ఇక నువ్వు వెళ్ళొచ్చు. |
| తలూపి-తలెత్తకుండా బైటికి వెళ్ళిపోయాడు సత్యం.. | | |
| పపకా నవ్వింది చిక్కు. | మహా : | నవ్వింది చాల్లే కానీ పొద్దున్నే ఎక్కడికి వెళ్ళావే.. |
| | చిక్కు : | షరా మామూలే.. ఇదిగో నీకు పువ్వులు |
| అంటూ పువ్వులు ఇచ్చింది. | మహా : | అబ్బ ఎంత సుకుమారంగా.. |
| | చిక్కు : | నిద్రపోతున్న బుజ్జి పాపాయిల్లా వున్నాయి కదమ్మా.. |
| | మహా : | మరే.. మళ్ళీ ఆ చిట్టితల్లే ఇచ్చిందా.. |
| | చిక్కు : | అవునమ్మా.. నా ఫ్రెండ్ చిట్టితల్లే ఇచ్చింది. |
| | మహా : | బావుందే మీ స్నేహం.. ఆ పిల్ల రోజూ ఇవ్వడం.. నువ్వు పట్రావడం.. అవునే నువ్వు అస్తమానం దానింటికి వెళ్ళడమే కానీ ఆ పిల్ల మనింటికి రాదేం? |
| పకపకా నవ్వింది. | | |
| | చిక్కు : | దాన్నే అడుగు. |
| | మహా : | సర్లే నేనెప్పుడు ఇల్లు కదలాలీ.. |
| | చిక్కు : | ఇదిగో జాంపండు.. |
| | మహా : | ఇదెవరిచ్చారే.. ఇది కూడా చిట్టితల్లే ఇచ్చిందా.. |
| | చిక్కు : | నో... వెనక వీధిలో వున్న చిన్న మావయ్య ఇచ్చాడు. |
| | మహా : | చిన్న మావయ్యా.. మొత్తానికి చుట్టు పక్కలంతా చుట్టరికం కలిపేశావ్... ఇది నీకే ఇచ్చారుగా నువ్వే తిను... |
| పకపకా నవ్వింది.. | చిక్కు : | నేను తినేశాగా.. |
| అంటూ బైటికి వెళ్ళింది. | మహా : | మళ్ళీ ఎక్కడికే... దీనికి ఒక చోట కాలు నిలవదు కదా.. |
| అంటుండగానే వెళ్ళిపోయింది. మహాలక్ష్మి జాంపండు వంక చూసి గాలిలో లెక్కలు వేసింది... తేలలేదు. తిన్నగా తులసి కోట దగ్గరకి వచ్చింది. | | |
| | మహా : | అమ్మా.. తులసమ్మ తల్లీ.. పొద్దు పొద్దున్నే ఇదేం పితకలాటకం తల్లీ.. అసలు చిక్కూని అనాలి. ఆ తెచ్చేదేదో నాలుగు పళ్ళు తేవచ్చు కదా.. లింగు లిటుకుమంటూ ఒకటి తెచ్చి చిక్కుల్లో పడేసింది... ఆయనకి జామపండు ఇష్టం, పిల్లడికి ప్రాణం... మన్లో మాట నాకు ఇష్టం, ప్రాణం రెండూను.. వున్న |

పండేమో ఒకటి.. ఎవరికివ్వాలి? ఎవరు తినాలి?

(నేపధ్యంలో ఒక గొంతు) ఓబివి : మహాలక్ష్మీ...

అదిరిపడి అటూ ఇటూ చూసి...

మహా : అమ్మా తులసమ్మా నువ్వు పలికావా అమ్మా..

ఓబివి : తులసమ్మని కాదు మహాలక్ష్మీ... నీ అంతరాత్మని..

మహా : ఇంతోటి సినిమాకి డబల్ యాక్షన్ ఎందుకని... నాక్కూడా అంతరాత్మేవిటి చోద్యం కాకపోతే.. సర్లే ఎందుకు వూడి పడ్డావో చెప్పేడు..

ఓబివి : ఈ మాత్రం దానికి ఆపసోపాలు పడతావేంటి పిచ్చిదానా.. ముక్కలుగా కోసి ముగ్గురూ తినండి మహాలక్ష్మీ..

మహా : ఆ మాత్రం నాకు తెలవకనా అంతరాత్మా. మా ముగ్గురికీ కొరుక్కు తినడమే గానీ కోసుకు తినడం ఇష్టం లేదు..

ఓబివి : ఇంతోటి ఫ్యామిలీకి ఇష్టాలు కూడానా...

మహా : హన్నా.. ఎంత పొగరే నీకు... ఎంత మిడిల్ క్లాస్ వాళ్ళం అయితే మాత్రం ఇష్టాఇష్టాలుండవా ఏంటి? నీ ఉచిత సలహాలు నాకేం అవసరం లేదు.. వెళ్ళు వెళ్ళు..

ఓబివి : అలాగే మహాలక్ష్మీ.. ఇంకెప్పుడూ రాను బై..

ఆలోచనలో పడింది.. మహా : ఇదిప్పుడెవరికివ్వా లి? నేను సరే జిహ్వ చంపుకుని నోరు కట్టేసుకుంటాను. భర్త, పిల్లల కన్నా రుచులు ఇష్టాలు ఎక్కువా ఏంటి? ఆయనకిస్తే ఆయన ఎలాగూ పిల్లాడికిచ్చేస్తారు. అందుకని పిల్లాడికి ఇవ్వడమే కరెక్ట్.. సచిత్తూ.. సచిత్తూ...

సచి : ఏంటమ్మా..

మహా : ఇంకా సంపు నింపడం అవలేదా..

సచి : అయింది. సంపు నిండగా ట్యాంకర్లో మిగిలిన నీళ్ళు వేస్ట్ ఎందుకని బకెట్లలో పడుతున్నాడు నాన్న..

మహా : పోతే పోయాయి కాసిని నీళ్ళు.. ఈయనికి చాదస్తం బాగా ఎక్కువైపోతోంది. అద్సరే ఇది తిను..

సచి : వావ్ జాంపండు.. ఎక్కడిది..

మహా : చిక్కు తెచ్చింది..
సచి : మరి నీకు...
మహా : నేనూ అదీ తినేశాం.. జాంపండు
జ్ఞాపక శక్తికి మంచిది.. నువ్వు తిను.

అంటూనే వెళ్ళిపోయింది లోపలికి..
సచిత్ జాంపండు కొరకబోయి
ఆగాడు.. సచి : అంటే అమ్మ, చిక్కు తినేశారు. నాన్న
సంగతి అడగలేదే.. పాపం నాన్న
ఇంటికి ఏం తెచ్చినా మేం అందరం
తినందే తను తినడు. నాన్నకివ్వకుండా
అమ్మ నాకెందుకిచ్చింది. వొకవేళ నాన్న
కూడా తినేశాడా?

సుదర్శనం వస్తూ.. సుద : ఏంట్రా తినేశాడా అంటున్నావ్..
సచి : జాంపండు నాన్నా..
సుద : నేనెక్కడ తిన్నాన్రా.. ఇప్పుడేగా ట్యాంకర్
వాడ్ని పంపించి వస్తున్నాను.
సచి : అయితే.. ఇదిగో నువ్వు తిను.

జాంపండు ఇచ్చాడు తండ్రికి.
సుద : ఇక్కడే వున్నావ్.. ఎప్పుడు కొన్నావురా..
సచి : చిక్కు తెచ్చింది నాన్నా..
సుద : ఓ..
అని కొరకబోతూ ఆగి... నువ్వు తిన్నావా?
సచి : ఆ.. ఆ.. తిన్నాం?

అంటూ లోపలికి వెళ్ళిపోయాడు..
సుదర్శనం జాంపండు కొరకబోతూ
ఆగి... సుద : చిక్కు తినేసి వస్తుంది.. వీడు
తి న్నానన్నాడు. నేను తినబోతున్నాను..
మరి అది? అందరూ తిన్నారా లేదా
అని తాపత్రయ పడుతుంది కానీ నాకిది
కావాలని ఎప్పుడూ నోరు తెరిచి
అడగదు పాపం... నాకేముంది అలా
బైటికెళ్ళినప్పుడు తినొచ్చు.. మహాలక్ష్మి..
మహాలక్ష్మి..
మహా : ఆ... వచ్చే.. వచ్చే... ఇడ్లీలు స్టవ్
మీద ఎక్కిస్తున్నాను... ఏమిటి పిల్చారు..

చేతులు గబుక్కున వెనక్కి పెట్టుకున్నాడు..
సుద : కళ్ళు మూసుకుని చెయ్యి పట్టు..
మహా : ఎందుకో..
సుద : నీకో గిఫ్ట్ ఇస్తాను..

అతని నుదుటి మీద చెయ్యి వేసి

| | | |
|---|---|---|
| చూస్తూ.. | మహా : | వొంట్లో బానే వుంది కదా.. |
| | సుద : | అదేంటి పుసుక్కున అలా అనేశావ్..<br>కళ్ళు మూసుకుని చెయ్యిపట్టు.. |
| | మహా : | ఇంతోటి సరసానికి దుప్పటెందుకని<br>ఏం గిఫ్టో.... |
| | సుద : | కళ్ళు మూసుకో మరి... |
| | మహా : | బానేవుంది సంబడం.. |
| కళ్ళు మూసుకుని చెయ్యి చాచింది.<br>చేతిలో జాంపండు పెట్టాడు | | |
| సుదర్శనం.. చూసింది.. | మహా : | అరే జాంపండు.. ఎక్కడిది? |
| | సుద : | వివరాలు అడక్కు.. తినెయ్.. |
| | మహా : | మరి మీకు.. |
| | సుద : | అది.. ఆ.. బండి దగ్గరే తినేశాను.. |
| | మహా : | కొన్నారా... అమ్మా తులసీ సమస్యని<br>ఇలా పరిష్కరించావా తల్లీ.. |
| అంటూ తినబోయింది.. | | |
| లోపల్నుండి వస్తూ.. | సచి : | నాన్నా... నేన్నీకు జాంపండు ఇచ్చానని<br>అమ్మకు చెప్పకు. |
| అని తల్లిని చూసి షాక్ అయ్యాడు.. | | |
| | మహా : | వొరేయ్... అంటే... ఇది.. నేను<br>నీకిచ్చింది... నువ్వు నాన్నకి.. |
| అవునన్నట్లు తలూపాడు.. | సుద : | అంటే నీకు ఇష్టం కదా అని. |
| | మహా : | మీరు తినకుండా నాకిచ్చారా.. |
| చిక్కు వస్తూ.. | చిక్కు : | ఓర్నాయనో.. ఓరి దేవుడోయ్..<br>జాంపండు సెంటిమెంటు తెగ పండేసింది.<br><br>ఆపండ్రా బాబూ... ఆపండి.. ఇలాంటి<br>భారీ భారీ త్యాగాలు చేస్తారనే చిన్న<br>మావయ్యని అడిగి ఇంకో రెండు పళ్ళు<br>తెచ్చా.. తినండి. |
| అంటూ రెండు జాంపళ్ళు ఇచ్చింది.. | | |
| మహా | : | అబ్బ.. ఎంత బావున్నాయో..<br>చూస్తుంటేనే కడుపు నిండి<br>పోయినట్టుంది. |
| | సుద : | కానీ నాకు ఆకలేస్తోంది.. టిఫిన్ పెట్టు... |
| | మహా : | అబ్బ.. మీరుండండీ.. అవునే చిక్కూ. |
| సుదర్శనం లోపలికి వెళ్ళిపోయడు.. | | అస్తమానం అందరిళ్ళల్లో పూలు, పళ్ళూ<br>తీసుకొస్తున్నావ్ కద.. మనం ఏదో రకంగా<br>ముట్టచెప్పకపోతే బాగోదు. |
| | చిక్కు : | వాళ్ళలా ఏం అనుకోరమ్మా.. |
| | మహా : | అహా.. ఇంతోటి పూలకీ, పళ్ళకీ ఋణాన<br>పడిపోడం దేనికని... |

లోపల్నుంచి సుదర్శనం గావుకేక
పెట్టాడు.. (ఓబివి) సుద : మహాలక్ష్మి..
మహాలక్ష్మి, సచిత్, చిక్కూ అదిరి
పడ్డారు.. లోపలికి వెళ్ళబోతుంటే
సుదర్శనం బైటికి వచ్చాడు.
చేతిలో టిఫిన్ ప్లేట్ వుంది.

సుద : కారం.. కారం... హమ్మో.. కారం..

నీళ్ళు కావాలని సైగ చేశాడు..

మహా : ఇంతోటి దానికి ముకాభినయం ఎందుకని
మంచినీళ్ళు తాగొచ్చుకదా..

వెళ్ళిపోయింది లోపలికి.. సుద : హా.. మంచినీళ్ళు లేవు.. హా కారం...
ఓ కారం..

మహా : అవును కదూ... మర్చేపోయాను..
వాటర్ క్యాన్ వాడు రాలేదింకా.. చిక్కు
కాస్త ఎదురింటికెళ్ళి వాటర్ బాటిల్
పట్రాపే..

వెళ్ళింది చిక్కూ.. సచి : ఆఫ్టాల్ మంచి నీళ్ళకోసం వాళ్ళని
అడగటం ఏంటమ్మా.. కొనుక్కొస్తానుండు

బైటికి వెళ్ళాడు..
ఎక్కిళ్ళు పెడుతున్నాడు సుదర్శనం..

సుద : హా.. హు..

అంటూ గోలెత్తి పోతున్నాడు

మహా : ఏదైనా తినే ముందు మంచి నీళ్ళు
పెట్టుకోవాలని లక్ష సార్లు చెప్పాను
వుహూ.. చెవి కెక్కదు. అయినా
ఇంతోటి ఇడ్లీలకి అంత మిరప్పళ్ళ
కారం ఎందుకని అంత పచ్చడేంటి..
అనుభవించం డి... ఏం చేస్తాం..

సుద : హా.. హా.. ఓ...

అరుస్తున్నాడు.. మహా : అయ్యో.. ఇప్పుడెలా.. మంచినీళ్ళకోసం
పిల్లలు వెళ్ళారుగా కొంచెం ఓర్చుకోండి.

సుద : కారం.. కారం...

మహా : అయ్యో నేనేం చెయ్యగలనండీ...

అంటుంటే సుదర్శనం గబుక్కున

మహాలక్ష్మిని పట్టుకుని లిప్‌కిస్ ఇచ్చాడు
గాఢంగా.. మహాలక్ష్మి వొదిలించుకునే
ప్రయత్నం చేస్తోంది.
క్షణం తర్వాత వొదిలేసి... సుద : హమ్మయ్యా.. కొంత శాంతించింది
మంట...

సడెన్ గా... మహా : మంట మంట.. అంతకారం ఎలా తిన్నారండీ.. మంట మంట... హా... హూ..
ఆల్మోస్ట్ ఒకేసారి సచిత్, చిక్కూ వచ్చారు.. వాటర్ బాటిల్స్తో-
సుదర్శనం, మహాలక్ష్మి చెరో బాటిల్ తీసుకుని తాగేసారు..
రొప్పుతున్నారు.. చిక్కు : అమ్మా.. నాన్న సరే పచ్చడి తిన్నాడు.. నోరు మంట పుట్టింది. నీకెందుకు మంట పుట్టింది..
ఏం చెప్పాలో తోచక సిగ్గుతో బిక్కచిక్కిపోయింది మహాలక్ష్మి..భార్య అవస్థ గ్రహించి.. సుద : అంటే.. అంటే... అది ఆ.. మహా పతివ్రతలకి అంతేనమ్మా మొగుడికి ఏ ఫీలింగ్ కలిగితే వాళ్ళకీ అదే ఫీలింగ్ కలుగుతుంది..
చిక్కు : ఓహో... నాకు ఆకలేస్తోంది... అంటే నా కాబోయే మొగుడికి ఆకలేస్తోందన్న మాట.. పదరా అన్నయ్యా టిఫిన్ తిందాం.

వెళ్ళారు.. వాళ్ళు వెళ్ళారని నిర్ధారించుకున్నాక తర్వాత అటూ ఇటూ చూసి వచ్చి సుదర్శనం నెత్తిమీద మురిపెంగా మొట్టికాయ మొట్టింది మహాలక్ష్మి.. సుద : అబ్బ.. అయినా బావుంది.. రోజు ఇలా మొట్టికాయల ప్రోగ్రాం పెట్టుకుందామా
చిరుకోపం, సిగ్గు, సంతోషం వగైరా ఫీలింగ్స్తో మహా : మిమ్మల్ని... బొత్తిగా సిగ్గులేని మనిషెక్కడో
అంటూ లోపలికి వెళ్ళిపోయింది..
అదే మూడ్లో వుండిపోయాడు..
సుద : ఓహ్... వాట్ ఏ రొమాంటిక్ డే... వాట్ ఎ బ్యూటిఫుల్ మొట్టికాయ్
వాటర్ క్యాన్ తో వాటర్ క్యాన్ కుర్రాడు వచ్చాడు.. కుర్రాడు : సార్.. వాటర్ క్యాన్..
క్యాన్ దింపాడు..
సచిత్ ఖాళీ క్యాన్ తెచ్చిచ్చి ఫుల్ క్యాన్ లోపలికి తీసుకెళ్ళాడు.. వాటర్ క్యాన్ కుర్రాడు ఖాళీ క్యాన్ తీసుకుని వెళ్ళాడు
సుదర్శనం తన మూడ్లోనే వున్నాడు.. పారిపోయాడు.
గంగాధరం వచ్చాడు చేతిలో ప్లాస్టిక్ సంచి చంకలో ఒక లెదర్ బ్యాగ్ తో

సుదర్శనం మొహం మీద చిటికె వేసి..

గంగా : ఎక్స్ క్యూజ్ మీ..

సుదర్శనం ఉలిక్కిపడి అతన్ని చూసాడు..

అడక్కుండా లోపలికి అడుగు పెట్టడం తప్పు... అలా అడక్కుండా అడుగు పెట్టాను కాబట్టి...

సుద : ఎవరోయ్ నువ్వు

గంగా : బేసికల్ గా మనిషిని.. బేస్మెంట్ దాకా వెళ్ళి చూస్తే బీరకాయ పీచుని..

సుద : ఏదో వొకటిలే ఇంతకీ ఏం కావాలి?

గంగా : చిన్న ఎమెండ్‌మెంట్.. ఏం కావాలి కాదు.. ఎవరు కావాలి అని అడగండి.. మహాలక్ష్మి కావాలి..

సుద : అంటే మా ఆవిడ.. మహాలక్ష్మి.. మహాలక్ష్మి.. నీకోసం ఎవరో వచ్చారు.

వస్తూ గంగాధరాన్ని చూసి...

మహా : తమ్ముడూ...

గంగా : అక్కయ్యా..

అంటూ ఫ్రూట్స్ ప్యాకెట్ ఇచ్చాడు.. అవి టీపాయ్ మీద పెట్టింది మహాలక్ష్మి..

సుద : మహాలక్ష్మీ పెద్ద పెద్ద స్థలాలు కొనకుండా ఎక్కడ పడితే అక్కడ 30 గజాలు, 50 గజాల స్థలాలు కొని డబ్బులు తగ లేస్తుంటాడు.. వెర్రివెంగళాయ్.. తిక్క ముండా కొడుకు అంటుంటావ్ వీడేనేమిటి?

మహా : స్.. స్.. అలా ఎప్పుడన్నాను.. చిన్న చిన్న స్థలాలు కొనడం మా తమ్ముడికి హాబీ అని చెప్పాను..

గంగా : బావగారూ ఎవరు ఎలా అనుకున్నా.. ఓ వీడేనేమిటి మీ అబ్బాయి..

సత్యం వచ్చాడు బైటనుంచి... రియాక్షన్ ఆఫ్ సత్యం...

మహా : ఛీ.. ఛీ.. ఇతను మన మేడ మీద గదిలో అద్దెకుంటున్నాడు..

సత్యం : నమస్కారమండీ..

అంటూనే టీపాయ్ మీదున్న ప్లాస్టిక్ బ్యాగ్ ని చూసాడు..

ఎవరండీ ఈ ప్లాస్టిక్ బ్యాగ్ తెచ్చింది..

గంగా : నేనే.. పళ్ళు పట్టుకొచ్చాను.

సత్యం : పళ్ళతో పాటు పొల్యూషన్ పట్టుకొచ్చారండీ. ప్లాస్టిక్ సంచులు వాడకూడదండీ. పర్యావరణ శాస్త్రవేత్తలు ప్రభుత్వం వారు కూడా చెప్తున్నారు

కదండీ..

గంగా : గొప్పోడివే నీ పేరేంటి బాబూ..

సత్యం : సత్యం అండీ..

గంగా : బావుందయ్యా..

సత్యం : అదేనండీ.. అందరూ నా పేరు బావుందటారండీ. నేనేం చెప్పినా బాలేదంటారండీ. సత్యం చెప్పడం వల్ల అలా అంటున్నారా - సత్యాన్ని అనబడే నేను చెప్పడం వల్ల అలా అంటున్నార.. అర్థం కావడం లేదండీ..

అంటూ ప్లాస్టిక్ కవర్ చెత్త బుట్టలో వేయబోయి ఆగి...

వొద్దండీ.. ఇది మట్టిలో కలవాలంటే ఆరొందల ఏళ్ళు పడుతుందండీ.. బైటికి తీస్కెళ్ళి కాల్చేస్తానండీ.

సుద : సత్యం నువ్వు నాకు నచ్చావోయ్. ఆ చెప్పేది అలా మెత్తగా కాకుండా కాస్త దబాయించి చెప్పు.

సత్యం : నా మాట తీరు అంతేనండీ.. సౌమ్యంగా చెప్తేనే ఎవరూ వినడం లేదండి. కఠినంగా చెప్తే ఎవరు వింటారండి..

వస్తానండీ.

వెళ్ళిపోయాడు.. చిక్కూ పరిగెడుతూ వచ్చింది.. వెంట సచిత్ వచ్చాడు..

చిక్కు : అమ్మా.. అన్నయ్య చూడూ.

అంటూ కొత్త వ్యక్తి గంగాధరాన్ని చూసి ఆగిపోయారు.

మహా : తమ్ముడూ.. వీడు మా అబ్బాయి - పేరు సచిత్.. కాబోయే సైంటిస్టు..

గంగా : వావ్..

సచి : హాయ్ మావయ్యా..

మహా : ఇది మా అమ్మాయి చిక్కు..

గంగా : చిక్కు. అదేం పేరక్కా..

సుద : ఇది వరకు మేము అద్దెకున్న ఇంటి పక్క నార్త్ వాళ్ళు వుండేవాళ్ళు.. వాళ్ళు ముద్దుగా దీన్ని చీకు అని పిలిచేవారు.

మహా : చీకు అంటే సపోటా పండుట..మాకూ అదే అలవాటైంది..

చిక్కు : అమ్మా.. మీరు ఈ మావయ్యతో మాట్లాడుతుండండి నేను పెదమావయ్య వాళ్ళింటికి వెళ్ళొస్తాను.

అంటూనే తుర్రుమని పారిపోయింది..

గంగా : ఆ.. అక్కయ్యా నేనో పని మీద వచ్చాను

వూరి బైట మీకు 50 గజాలు స్థలం వుంది కదా..

మహా : ఆ.. వుందిలే ఎందుకూ పనికిరాని స్థలం

సచి : దానికి మొన్నా మధ్య యల్ ఆర్ ఎస్ కూడా కట్టాం.

గంగా : అది అమ్మితే ఎంతొస్తుంది.

సచి : అదెవడు కొంటాడు. కొన్నా 50 వేలు కన్నా రాదట. ఎల్ ఆర్ ఎస్ కట్టినప్పుడు కనుక్కున్నాను..

గంగా : ఓకే.. స్ట్రైట్‌గా పాయింట్ కొస్తాను.. ఆ స్థలం మీరు నాకు అమ్మితే లక్షా యభైవేలు ఇస్తాను.

సుద : నువ్వు యాభై లక్షలు ఇచ్చినా ఆ స్థలం నేను అమ్మను..

సచి : అదేంటి నాన్నా.. అలా అంటావ్ లక్షన్నర వస్తే నా కోచింగ్ ఫీజ్‌కి వస్తుంది కదా.

మహా : నీ కోచింగ్ సంగతి ఎలా వున్నా పిల్ల పెళ్ళికి వేడినీళ్ళకి చన్నీళ్ళుగా వుంటుంది.

సుద : మీరెన్ని కారణాలు చెప్పినా.. నేను ఆ స్థలం అమ్మను కాక అమ్మను. అది అమ్మడం నాకు ఇష్టం లేదు.

మహా : అదేంటండీ అలా అంటారు. ఇప్పుడా స్థలం వుండి ఎవర్ని ఉద్ధరిస్తుందట..

సచి : అయినా ఆ స్థలం ఎందుకు పనికొస్తుంది నాన్నా.

సుద : నేను చచ్చాక నన్ను తగల బెట్టడానికి పనికొస్తుంది సరేనా?

మహా : అయ్యో అవేం మాటలండీ.. శుక్రవారం పూట..

గంగా : బావగారూ క్షమించండి. మీరన్నది అక్షరాల నిజం. అది మీ స్వార్జితం.. వొదులుకోమని నేను కూడా చెప్పను.

సచి : ఏంటి మావయ్యా నువ్వు కూడా..

గంగా : మీ స్థలం మీకే వుండి.. నేనిస్తానన్న లక్షన్నర మీకు వస్తే మీకేమన్నా అభ్యంతరమా..

సుద : అదెలా కుదురుతుంది..

గంగా : సింపుల్ బావగారూ. మీ స్థలాన్ని నాకు ఓ పదేళ్ళ పాటు లీజుకి ఇవ్వండి..

అప్పుడు మీకు లక్షన్నర వస్తుంది,
పదేళ్ళ తర్వాత మీ స్థలం మీకు వస్తుంది.. అప్పుడు చుట్టూ డెవలప్ అయి రేట్లు కూడా పెరుగుతాయ్..

మహా : ఇదేదో బావుంది కదండీ..

సుద : బావుందనుకో.. కానీ..

మహా : కానీ లేదు కాశ్మీరు లేదు. అలా కానివ్వరా తమ్ముడూ..

గంగా : వెరీగుడ్.. ఇదిగో లక్షన్నర.. ఇవాల్టి నుంచీ పదేళ్ళపాటు మీ స్థలం నా స్వాధీనంలో వుంటుంది.

సుద : అది సరేనయ్యా.. మరి పత్రాలు అవీ..

గంగా : మీ నోటి మాట చాలు బావగారూ.. ఈ పత్రాలు ఇవన్నీ కేవలం ఫార్మాలిటీకే.. ఎందుకైనా మంచిది. సేల్ డీడ్, లీజ్ ఎగ్రిమెంట్ రెండూ రెడీ చేయించి పట్టుకొచ్చాను.. ఆ.. ఇక్కడ సంతకం పెట్టండి కేవలం ఫార్మాలిటీ.. ఇదిగో లక్షన్నర!

అంటూ పేపర్స్ ముందు పెట్టాడు.

మహాలక్ష్మి డబ్బు తీసుకోబోతుంటే.. సంతకం పెట్టకుండా ఆగాడు సుదర్శనం..

గంగా : ఒక్క క్షణం ఆగక్కా.

మహా : మళ్ళీ ఏంటి?

గంగా : ఆ స్థలం లీజుకిచ్చాక అక్కడ నేనేం చేసినా అడక్కూడదు..

సుద : ఏం చేస్తావేంటి.

గంగా : అదే అడగవద్దంటున్నాను.. ఆ ప్లేస్ ముందు చదును చేయిస్తాను..

సుద : అదెలా కుదుర్తుంది. అక్కడ రెండు పెద్ద పెద్ద చెట్లున్నాయి.. తాతల కాలం నాటివి..

మహా : అబ్బబ్బ మీకేం తెలీదు మీరూరుకోండి.. పాపం వయసయిపోయింది కదరా..

సుద : వయసు మీద పడిందంటే ఏమీ తెలీదని కాదే అన్నీ తెలిసీ ఏమీ చేయలేనివాడని అర్థం..

మహా : ఇంతోటి దానికి స్టేట్మెంట్లెందుకని.. సంతకం పెట్టండి..

సుదర్శనం సంతకం పెట్టాడు.
గంగాధరం లక్షన్నర మహాలక్ష్మికి

ఇచ్చాడు..
చిక్కు పరిగెత్తుకుంటూ వచ్చింది..
చిక్కు : అమ్మా ఇదిగో మామిడి కాయలు..
మహా : ఇవెవరిచ్చారే..
చిక్కు : పక్క వీధి పచ్చ మేడలో పెద్ద మావయ్య
మహా : ఇప్పుడే డబ్బొచ్చింది.. ఇంతలో
మామిడి కాయలు అంతా శుభమే..
చిక్కూ నువ్వు మామిడి కాయలు
శుభ్రంగా కడిగి తరుగుతూ వుండు.
చిక్కు లోపలికి వెళ్ళింది. తమ్ముడూ.. నువ్వు భోజనం చేసి మరీ
వెళ్ళాలి..
గంగా : అలాగే అక్కా..
మహా : అవున్రా తమ్ముడూ..
అడగబోయి ఆగింది.. వొద్దులే..
సుద : తనేం అడగాలనుకుంటుందో నాకు
తెల్సు.. లక్షన్నర పోసి నువ్వు లీజుకి
తీసుకున్నావు కదా అక్కడ నువ్వు ఏం
చెయ్యబోతున్నావా అని..
మహా : ఆ.. అదే.. అదే.. నీకేం లాభమా అని
గంగా : ఏం లేదు అక్కయ్యా.. ఆ స్థలాన్ని
శుభ్రం చేయించి అక్కడ తవ్వితే కానీ తెలీదు. లాభాలన్నీ భూమిలో వుంటాయ్.
మహా : అంటే లంకెల బిందెలు వుంటా
యేమిట్రా కొంపదీసి..
గంగా : అంతకన్నా గొప్పవి..
సచి : అంటే వజ్రాలు కాదు కదా
గంగా : అంతకన్నా గొప్పవి..
మహా : దేవుడు మేలు చేసి పెట్రోలు కాదు కదా.
గంగా : అంతకన్నా గొప్పవి..
సచి : అంతకన్నా గొప్పవా? ఏంటవి..
గంగా : నీళ్ళు..
మహా : నీళ్ళా!!
సుద : నీళ్ళా!!
సచి : నీళ్ళా!!
గంగ : అవున్రా.. ఏంటి నీళ్ళా అని అంత
ఆశ్చర్యపోతున్నారు. ఆక్సిజన్ తర్వాత
అత్యంత విలువైన, ఖరీదైన కమోడిటీ
వాటర్.. యస్ నీళ్ళు..!
మహా : నీళ్ళేం చేసుకుంటావురా..
గంగా : అమ్ముకుంటాను
సుద : నీళ్ళమ్ముకుంటావా?
గంగా : మీకు నీళ్ళెక్కడ్నించి వస్తున్నాయ్
సుద : కొనుక్కుంటున్నాం.

గంగా : దట్సిట్. కొనుక్కునే వాళ్ళు వుంటే అమ్మే వాడు తయారవుతాడు.. ఇవాళా రేపు నీళ్ళకన్నా బ్రహ్మాండమైన బిజినెస్ లేదు. అందుకే నేను ముందు చూపుతో చిన్న చిన్న స్థలాలు కొన్నాను. ఇప్పుడు బోర్లు వేస్తున్నాను.

పెద్దగా కేకలు పెడుతూ సత్యం వచ్చాడు..

సత్యం : కాపాడండీ.. నన్ను చంపేస్తారండీ.. రక్షించండీ..

సుద : ఏంటి సత్యం ఏమైంది..

కేకలకి లోపల్నుండి చిక్కు వచ్చింది. భయంతో మహాలక్ష్మిని పట్టుకుంది.. సత్యం వొణికిపోతున్నాడు..

సత్యం : వాళ్ళు నన్ను చంపేస్తారండీ.. కాపాడండీ..

అంటుండగానే రంపం చేతిలో

రంపంతో, డీజిల్ ఒక ఐరన్ రాడ్‌తో పరిగెత్తుకొచ్చారు.. వస్తూనే సత్యాన్ని ఇష్టం వచ్చినట్టు కొడుతున్నారు..

సుద : ఆపండి.. ఆపండి.. సత్యాన్ని ఎందుకు కొడుతున్నారు..

రంపం : సారూ ఇన్నేల్లనుంచి మనం మనం పక్కపక్కనే వు న్నాం..

డీజిల్ : మీకు మాకు ఎటువంటి గొడవలూ లేవు.

సుద : అద్సరేనయ్యా.. సత్యం అసలే అమాయకుడు అతనేం చేశాడు..

రంపం : ఈడమాయకుడా.. ఈ వొంటి వూపిరి గాడికి మా సామిల్లు వల్ల ఆరోగ్యం పాడైపోతుందంట..

డీజిల్ : మా బండ్ల పొగ వల్ల పర్యావరణమో అదేదో పాడైపోతుందంట.

రంపం : నా కొడుకు పొల్యూషనోల్లకి కప్లైంట్ చేశాడు..

కొట్టాడు సత్యాన్ని..

డీజిల్ : ఆల్లు ఎంటనే మాకు సెప్పారు.. ఈనాకొడుకునీ..

కొట్టాడు సత్యాన్ని...

సత్యం : అవునండీ.. మీరు చేస్తున్నది తప్పండి.. అందుకే కంప్లైంట్ ఇచ్చానండి.

రంపం : రేయ్

కుళ్ళ బొడుస్తున్నారు..

గంగా : ఆగండి.. ఆగండి ఫ్రెండ్స్.. నేను సత్యంతో మాట్లాడి కంప్లైంట్ వాపసు తీసుకునేలా చేస్తాను..

సత్యం : తీసుకోనండి.. వాపసు తీసుకోనండి..
వీళ్ళు నన్ను చంపేసినా కంప్లైంట్ వాపసు తీసుకోనండి..

రంపం : చంపితే నువ్వు తీసుకునేదేంట్రా..

డీజిల్ : చంపు నా కొడుకుని..

అంటూ కింద పడేసి రంపమూ,
ఐరన్ రాడ్ ఎత్తారు..
సత్యం చావు భయంతో చావు కేక
పెట్టాడు.. ఆ కేక సడెన్ గా
ఆగిపోయింది..

రంపం : గుండాగి చచ్చినట్టున్నాడు..

డీజిల్ : బతికున్నా మన జోలికి రాడు..
పద పోదాం

బైటికి వెళ్ళిపోయారు.
అందరూ సత్యం దగ్గరికి వచ్చారు.

సుద : సత్యం.. సత్యం..

సత్యం పిచ్చి చూపులు చూస్తున్నాడు..

సుద : భయపడకు సత్యం.. వాళ్ళెళ్ళిపోయారు.

సత్యం ఏదో చెప్పాలని
ప్రయత్నిస్తున్నాడు.. అతని గొంతు
పెగలడం లేదు..

మహా : అయ్యో.. పాపం.. ఏమైందండీ..

సుద : ఎదిరించే అతని గొంతు

మూగబోయింది. సత్యం మూగవాడైపోయాడు..
"అయ్యో" అన్న ఎక్స్ ప్రెషన్
అందరిదీ..

lights off...

నేపథ్యంలో ఓ గొంతు :-

ప్రేక్షక మాహాశయులారా.. సారీ ఫర్ ద ఇంటరప్షన్..
సత్యం గొంతు మూగబోయింది.. సత్యం గొంతు నొక్కేసి
All is well with the world అనుకుంటున్నాం..
అయ్యా... ఇప్పుడు చిన్న పిల్లలు మన మీద ఎక్కి గుండెల మీద
తన్ని ఎన్ని ఆటలు ఆడినా భరిస్తాం.. కానీ ఆ ఆటలు శ్రుతి మించితే
ఒక దెబ్బ వేస్తాం.
సరిగ్గా అదే జరిగింది..
ప్రకృతి కూడా మనం తనతో ఎన్ని ఆటలు ఆడుకున్నా సహించింది,
భరించింది.. ప్రకృతికి లొంగి వుండాలన్న ప్రాథమిక సూత్రాన్ని
మరిచి ప్రకృతిని లొంగదీసుకోవాలన్న మనిషి అత్యాశని ఏదో ఒక
నాడు ప్రతిఘటిస్తుంది ప్రకృతి.. అది హఠాత్తుగా జరిగిన మార్పు
కాదు..
అనేక రకాల కాలుష్యాలతో వుక్కిరి బిక్కిరై వూపిరాడక తన
సమతుల్యాన్ని తనే కాపాడుకోలేని నిస్సహాయ స్థితికి చేరుకుంది
ప్రకృతి..

ప్రకృతి గుండె మండి పోయింది..

చుక్క నీరు లేకుండా ఎండి పోయింది..
చెరువులు, నదులు, భూగర్భజలాలు  అన్నీ ఒక్కసారిగా ఆర్చుకు
పోయాయి.. తను రగిల్చిన మంటలో తనే తగులబడిపోతున్నాడు
మనిషి..
ఒకటి మాత్రం గుర్తు పెట్టుకోండి..
All is not well with the world!

దృశ్యం 3

దూరంగా ఎక్కడో కాకులు అరుస్తున్నాయి..
కుక్కలు ఏడుస్తున్నాయి.
స్పాట్ లైట్ పడింది తులసి మొక్క
మీద.. తులసి మొక్క గతంలోలా
పచ్చగా గుబురుగా లేదు.
ఎండిపోయి వుంది...

కాకుల అరుపులు, కుక్కల
ఏడుపులు నెమ్మదిగ ఫేడవుట్
అవుతున్నాయి..
వెలుతురు తులసి మొక్క మీద నుండి
స్లోగా గదంతా విస్తరిస్తోంది..

తులసి కోట దగ్గర మహాలక్ష్మి
కూడా ఎండిపోయిన మొక్కలా
కూర్చుని వుంది. ఆమె కళ్ళలో జీవం
లేదు. పెదవులు ఎండిపోయి వున్నాయి.
బుగ్గల  మీద ఆరిపోయిన కన్నీటి చారలు
వున్నాయి.. తదేకంగా వీధి గుమ్మం
వైపు చూస్తోంది.

ఆ గదిలో ఒక మూల సత్యం
నిర్వికారంగా, నిర్లిప్తంగా ఆకాశం
వైపు చూస్తున్నాడు..

క్షణం తర్వాత సుదర్శనం
వచ్చాడు.. అతని పరిస్థితి కూడా
అదే.. పెదవులు ఎండిపోయి మనిషి

పీక్కుపోయి ఆల్మోస్ట్ నడుస్తున్న
శవంలా వున్నాడతను..

అతన్ని చూడగానే లేని ఓపిక
తెచ్చుకుని ఎదురు వెళ్ళింది మహాలక్ష్మి
ఏమి లాభం లేదన్నట్లు సైగ చేశాడు..

నిరాశపడింది మహాలక్ష్మి..

సుద : ఎక్కడా చుక్క నీరు కూడా దొరకలేదు
చూద్దాం అబ్బాయికేమన్నా
దొరుకుతాయేమో..

కళ్ళు తిరిగి తూలి పడబోయాడు..
పట్టుకుంది మహాలక్ష్మి.. సోఫాలో
కుర్చోబెట్టింది.. వున్నట్టుండి
హృదయవిదారకంగా ఏడ్చాడు..
అంత ఏడ్చినా కళ్ళల్లో నీళ్ళు రాలేదు.
భయపడిపోయింది మహాలక్ష్మి.

మహా : ఏమైందండీ..

సుద : ఎలా చెప్పనే ఎక్కడా చుక్క నీరు లేదు.
దాహానికి తట్టుకోలేక చిన్న చిన్న
పిట్టలు, జంతువులు చచ్చిపోయి
గుట్టలు గుట్టలుగా పడి వున్నాయ్..
ఎటు చూసినా శవాలే.. అక్కడక్కడా
ముసలివాళ్ళు, పిల్లలు చచ్చిపోయి
వున్నారు.. కడుపులో దేవేసింది..
చావు తరుముకొస్తున్నట్లు అందరూ
నీళ్ళ కోసం వురుకులూ, పరుగులూ..

ఎవరూ ఇంకోళ్ళ గురించి పట్టించు
కోవడం లేదు.

సచిత్ వచ్చాడు. అతని వైపు
చూసింది మహాలక్ష్మి - తల అడ్డంగా
వూపాడు ఏమీ లాభం లేదన్నట్లు..
సత్యం ఎలాంటి ఎక్స్ ప్రెషన్ లేకుండా
వున్న చోటు నుండి కదలకుండా వీళ్ళని
చూస్తున్నాడు...

మహా : ఏమండీ నాకు తెలీక అడుగుతాను..
మనం బోర్ వెయ్యడం వల్లే ఇంత
నీటి కరువు వచ్చిందంటారా..

సుద : మహాలక్ష్మీ సూదితో నీ వేలి మీద పొడిస్తే
ఏమవుతుంది.

మహా : చురుక్కుమంటుంది. ఒక చుక్క
రక్తం వస్తుంది.

సుద : ఆ సూదుల్తో వొళ్ళంతా పొడిస్తే..

మహా : అమ్మో చచ్చూరుకుంటాను.

సుద : భూమి కుడా చచ్చిపోయింది.
మీ తమ్ముడి లాంటి వాళ్ళు

బిజి వచ్చాడు పరిగెడుతూ..

గంగ : అక్కాయ్ నన్ను కాపాడండి..

మహా : ఏమైందిరా

గంగ : వాళ్ళు చంపేస్తామంటున్నారు..
సుద : ఒకళ్ళు చంపేదేముంది... ఇంకో రెండ్రోజులు నీళ్ళు లేకపోతే అందరం చస్తాం..

అంటుండగానే రంపం, డీజిల్ వచ్చారు వాళ్ళ ఆయుధాల్తో..

గంగ : వీళ్ళే.. వీళ్ళే నన్ను చంపుతాం అంటున్నారు..
మహా : ఏమిటయ్యా మావాడేం చేశాడు.
రంపం : ఏం చేశాడా? ఎక్కడపడితే అక్కడ బోర్లు వేసేసి భూగర్భ జలాలన్నీ తోడేశాడు.. నీటి కరువుకు వీడే కారణం..
గంగ : ఏం కాదు నువ్వు కలప వ్యాపారం కోసం, భవనాలు కట్టడం కోసం అడవులన్నీ నరికేసావు. అందుకే వర్షాలు కురవడం లేదు. వర్షాలు కురిస్తే నీళ్ళు వుంటే నేను బోర్లు ఎందుకు వేస్తాను.
రంపం : వర్షాలు కురవంది అందుకేం కాదు. ఇదిగో వీడు.. వీడు డీజిల్ పొగతో వాతావరణాన్ని కాలుష్యం చేశాడు. అందుకే వర్షాలు పడటం లేదు.
గంగ : అవును మీ ఇద్దరే కారణం.
రంపం, డీజిల్ : కాదు నువ్వే కారణం..
గంగ : కాదు మీరే..
సచి : అబ్బబ్బబ్బా... ఓ పక్క నీళ్ళు లేక చస్తుంటే మధ్యలో మీ గోలేంటి.. పోండి ఇక్కడ్నుంచి.. లేకపోతే మీ ముగ్గుర్ని నేనే చంపేస్తాను.
అరిచాడు.. ఇంత నీటి కరువుకి కారణం మీ ముగ్గురూ.. పోండి..
ముగ్గురూ బైటికి వెళ్ళారు...
సుద : తప్పంతా నీ దగ్గర పెట్టుకుని వాళ్ళ నంటావేంట్రా..
సచి : నేనా.. నేనేం చేశాను..
సుద : నువ్వేం చెయ్యలేదు.. అదే నువ్వు చేసిన తప్పు.
సచి : నాన్నా ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు?
సుద : ఎక్కడో చంద్ర మండలం మీద నీళ్ళు వున్నాయా.. శుక్ర గ్రహం మీద నీళ్ళు వున్నాయా.. అని మీ సైంటిస్టులు లక్షల కోట్లు తగలేస్తున్నారు కానీ మనిషి కళ్ళల్లో నీళ్ళెందుకున్నాయో ఒక్క క్షణం అన్నా ఆలోచించార్రా మీరు..
మహా : ఇంతోటి దానికి ఇన్ని గొడవలెందుకని

బాగా గుర్తు చేశారు. ఒరేయ్.. నీ దగ్గర అదేదో సూత్రం వుంది కదా నీళ్ళు తయారు చేసేది.. అదేంటది..

సచి : $H_2O$

మహా : ఆ, అది అది ప్రయోగించి వీళ్ళ నోళ్ళు మూయించు.

సుద : అదేంటో కొంచెం వివరంగా చెప్పరా.

సచి : అంటే అది.. నీటిని విడగొడితే హైడ్రోజెన్ గ్యాస్ రెండు వంతులు, ఆక్సిజన్ ఒక వంతుగా విడిపోతుంది.

సుద : విడగొట్టడం చాతనైన వాడికి కలపడం ఎంతసేపురా.. గాలిలో కావల్సినంత హైడ్రోజన్ వుంది - ఆక్సిజన్ వుంది కలిపి నీటిని సృష్టించు...

సచి : నాన్నా.. అది బైట కుదర్దు ల్యాబరేటరీ లోనే కుదుర్తుంది.

సుద : పోనీ ల్యాబరేటరీ లోనే చెయ్యి. నీటి కరువు తీర్చు.

సచి : ప్రయోగం కోసమేగానీ ఇంత పెద్ద ఎత్తున నీటిని తయారు చెయ్యడం కుదర్దు..

సుద : కుదరకపోతే నీ ల్యాబరేటరీని తగలబెట్టు.

సచి : నాన్నా.. సైన్సుని అవమానిస్తున్నావు..

సుద : ఒరేయ్.. నాలుగు ఎయిర్ కండిషన్డ్ గదులు - పది గాజు బీకర్లు, టెస్ట్‌ట్యూబ్‌లు వున్న ల్యాబరేటరీని తగలబెట్టమంటేనే నీకు అంత పొడుచుకొచ్చిందే.. ఈ భూమి, ఈ ప్రకృతి ఇదంతా దేవుడి ల్యాబరేటరీ రా.. దీన్ని నాశనం చేస్తే ఆయనకెంత కోపం వస్తుంది.. వచ్చింది కాబట్టే..

సచి : నాన్నా..

సుద : నీది కేవలం ప్రయోగశాల - ఈ సృష్టి దేవుడు నిర్మించిన ప్రయోజనశాల..

దీని జోలికి వెళ్తే పరిణామాలు ఎలా వుంటాయో చూస్తున్నాం కదా..

సచి : అంటే సైన్సు వేస్ట్ అంటావా నాన్నా..

సుద : అలా అనడం లేదు.. మానవుడు కనుక్కున్న అతి చిన్న సృష్టి రహస్యం పేరు సైన్సు. ఆ కనుక్కున్నదేదో ప్రజలకి

వుపయోగపడేలా చెయ్యమంటున్నాను.

మహా : ఇంతోటి దానికి ఇంత కంఠశోష ఎందుకు.. వాడ్ని అన్ని మాటలు అన్నారే.. అన్నీ తెల్సిన మీరు ఏం చేస్తున్నారు. ఆపలేకపోయారా..

సుధ : విన్నారా నా మాట.. ఏం చెప్పబోయినా నీకు వయసైపోయింది. నీకేం తెలీదని నా నోరు మూసేశారు. తిలా పాపం తలా పిడికెడు.. అనుభవిద్దాం..

అంటూ ఆయాసపడిపోయాడు. విపరీతంగా.. నీళ్ళు కావాలని సైగ చేస్తున్నాడు..

మహా : అవే వుంటే ఇంత అనర్థం ఎందుకొస్తుంది. కాసేపు పడుకోండి.. వొరేయ్.. చిక్కూ అప్పుడనగా వెళ్ళింది.. ఎక్కడికి వెళ్ళిందో ఏంటో కాస్త చూడు.

అంటూనే లోపలికి వెళ్తూ..

వెళ్ళింది లోపలికి సుదర్శనంతో సహా..

సచి : ఎక్కడికి పోతుంది.. అదే వస్తుందిలే..

అంటూ విసుగ్గా వచ్చి సోఫాలో కూర్చున్నాడు. నాలుకతో పెదవులు తడుపుకునే ప్రయత్నం చేశాడు..

కానీ ఎండిన పెదవులు అలానే వున్నాయి.. ఏమీ చెయ్యలేని నిస్సహాయత, చిరాకు, కోపం రక రకాలుగా ప్రదర్శితమవుతోంది అతనిలో.. కళ్ళు మూసుకుని కణతలు రుద్దుకుంటున్నాడు. హఠాత్తుగా ఏదో గుర్తొచ్చి కళ్ళు తెరిచాదు.. గదిలో ఓ మూలగా వున్న చెత్త బుట్టని చూశాడు.. ఏదో ఆశ.. సచిత్ ప్రతి చర్యని సత్యం గమనిస్తున్నాడు. గబుక్కున లేచి వెళ్ళి సచిత్ చెత్త బుట్టలో వున్న చెత్త బైట పడేస్తున్నాడు. అందులో మట్టి కొట్టుకు పోయిన చిన్న నీళ్ళ బాటిల్ దొరికింది. అందులో కేవలం ఒక గుక్క నీళ్ళు మాత్రమే వున్నాయి. సత్యం కుడా వచ్చి సచిత్ పక్కన నిలబడి ఇదంతా చూస్తున్నాడు. సచిత్ కళ్ళు సంతోషంతో మెరిశాయి.. అటూ ఇటూ చూశాడు. ఈ బాటిల్ విషయం ఎవరితోనూ చెప్పవద్దని సైగ చేశాడు సచిత్ - అలాగేనని తలూపి ఓ పక్కగా వెళ్ళి

నిలబడ్డాడు - సత్యం! అటూ ఇటూ
చూశాడు - ఎవరూ చూడటం లేదని
నిర్ధారించుకున్నాక వాటర్ బాటిల్‌ని
ఆప్యాయంగా ముద్దు పెట్టుకుని

బాటిల్ మూత తీయబోయాడు.
వస్తూ..

సుద : సచిత్తూ... సచిత్తూ...

సచిత్ కంగారు పడి బాటిల్ని
గబుక్కున సోఫా పక్కన దాచి పెట్టి..

సచి : ఏంటి నాన్నా...

సుద : నాలిక పిడచ కట్టుకుపోయింది.
ఏం తోచడం లేదు.

అంటూ సోఫాలో సెటిల్ అయ్యాడు.
అలా కూర్చోవడం సచిత్‌కి కోపంగా
వుంది.

సచి : నాన్నా.. ఇక్కడెందుకు లోపల
పడుకోవచ్చుగా..

సుద : ఇక్కడ అలవాటు కదరా.. లోపల
వుండలేకపోతున్నా.

సచిత్ నుదుటి మీద కొట్టుకొని
లోపలికి వెళ్తూ - ఆ బాటిల్ విషయం
చెప్పవద్దని సత్యానికి సైగ చేశాడు..
సత్యం అలాగేనని తలూపాడు చిన్నగా..
అటూ ఇటూ ఇబ్బందిగా కదుల్తున్నాడు
సుదర్శనం..ఒక పక్కకి పడుకున్నాడు..
అలా పడుకోవడంతో సోఫా పక్కన వున్న
వాటర్ బాటిల్ కనబడింది.
గబుక్కున లేచి కూర్చున్నాడు - సత్యం
వచ్చి సుదర్శనం పక్కన నిలబడ్డాడు..
బాటిల్‌లో నీళ్ళు చూసేసరికి ప్రాణం
లేచి వచ్చి నట్టయింది సుదర్శనానికి..
పక్కన వున్న సత్యాని చూశాడు.
బాటిల్ తీసుకుని లోపలికి వెళ్ళబోయి
ఆగాడు. క్షణం ఆలోచించాడు. తనే
తాగాలని నిర్ణయించుకుని సత్యం
చేతులు పట్టుకున్నాడు. భార్యకి,
కొడుక్కి చెప్పవద్దని సైగ చేశాడు.
సత్యం తలూపి నోరు మూసుకున్నాడు.
ఓ పక్కగా వెళ్ళి నిలబడ్డాడు.
అటూ ఇటూ చూసి బాటిల్ మూత
తీయబోయాడు..
వస్తూ..

మహా : ఏమండీ.. ఇంతట్లో ఎటు పొయ్యారు..

అంటూ వస్తోంది.. సుదర్శనం

గబుక్కున వాటర్ బాటిల్ని తులసి
కోట దగ్గర దాచేశాడు

| | | | |
|---|---|---|---|
| కంగారుపడుతూ.. | సుద | : | ఏంటిలా వచ్చావ్.. |
| | మహా | : | ఏదో అలికిడైతే.. చిక్కా |

వచ్చిందేమోనని.
అంటూ తులసి కోట దగ్గర కూర్చుంది.

| | | | |
|---|---|---|---|
| | సుద | : | అక్కడెందుకూ.. లోపలికి వెళ్ళు. |
| | మహా | : | ఇక్కడ కూర్చుంటే మీకేం అడ్డం.. |

కూర్చుంది..
తను వెళ్తే ఆమె కూడా వస్తుందన్న
వుద్దేశ్యంతో సుదర్శనం లోపలికి
వెళ్ళాడు...

| | | | |
|---|---|---|---|
| | సుద | : | సర్లే లోపలికెళ్దాం రా.. |

మహాలక్ష్మి కదల్లేదు..
సచిత్ సోఫాలో తండ్రి లేడు కదా
అని రాబోయి తులసి కోట దగ్గర
తల్లిని చూసి గబుక్కున లోపలికి
వెళ్ళాడు..

| | | | |
|---|---|---|---|
| | మహా | : | ఇంతోటి ప్రాణాలు గొంతులో కాసిన్ని తులసి నీళ్ళయినా పడకుండా హరీ అంటాయేమో! |

అనుకుంటూ తులసికోట పక్కన వున్న
వాటర్ బాటిల్ని చూసింది. గబుక్కున
లేచి బాటిల్ తీసుకుంది. సంతోషంతో
ముఖం వెలిగిపోయింది. గబ గబా భర్త
వెళ్ళిన వైపు వెళ్ళబోయి ఆగింది.
కాదనుకొని కొడుకు గది వైపు
వెళ్ళబోయి ఆగింది.
సత్యాన్ని చూసింది.. ఎవరితో చెప్పవద్దని
చేతులు జోడించి దండం పెట్టింది..
సత్యం నోరు మూసుకున్నాడు.. గబగబా
తులసి కోట దగ్గరకి వచ్చింది.. బాటిల్
నైవేద్యం పెట్టినట్టు తులసి మొక్కకి
చెయ్యి చూపించి.. బాటిల్ మూత
తీయబోయింది. గబుక్కున వచ్చాడు..

| | | | |
|---|---|---|---|
| | సుద | : | ఏయ్.. ఏయ్.. అది నాది.. |
| | మహా | : | మీదేవిటి నాకు దొరికితేనూ.. |
| వస్తూ.. | సచి | : | మీ ఇద్దరిదీ కాదు. అది ఫస్ట్ నాకు దొరికింది. కావాలంటే సత్యాన్ని |

అడగండి..

బాటిల్ లాక్కోబోయారు.

సుద : కాదు నాదీ..

మహా : కాదు నాదీ.

సుద : నాక్కావాలి

మహా : నాకే కావాలి.

బాటిల్ లాక్కుంటున్నారు..

సచి : ఆపండి గోల.. ఇలా లాక్కుంటే ఎవరికీ కాకుండా పోతుంది.

మహా : ఇంతోటి నీళ్ళకి యుద్ధమెందుకు

తలా కాస్త తాగుదాం.

సుద : అవును తలా కాస్త తాగుదాం.

సచి : అలా అయితే ఎవరికీ నాలిక కుడా తడవదు..

సుద : ఆ సంగతి తర్వాత.. ముందు బాటిల్ అక్కడ పెట్టు.

సచి : నా దగ్గర వుంటే ఏం?

మహా : నువ్వొక్కడివే తాగేస్తే...

సచి : అమ్మా!!

నువ్విలా అంటావనుకోలేదు అన్న భావంతో ఆశ్చర్యపోతూ అన్నాడు. మహాలక్ష్మి తలొంచుకుంది.. సుదర్శనం రెప్ప వేయకుండా బాటిల్ వంకే చూస్తున్నాడు. ఇదంతా సత్యం నిర్లిప్తంగా చూస్తున్నాడు.

సచి : ఆల్‌రైట్. నీటి కోసం ప్రపంచంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి.. కానీ ఒక కుటుంబంలో జరగడం ఇదే ఫస్ట్‌టైం..

సుద : యుద్ధమేవిట్రా యుద్ధం.. సామరస్యంగా పరిష్కరించుకుందాం అని..

సచి : తేడా ఏముంది నాన్నా.. ఎదుటి వాడ్ని చంపితే యుద్ధం.. ఎవడ్ని వాడే చంపుకుంటే సంధి.. ఇది కూడా యుద్ధమే.. సంధి యుద్ధం

మహా : ఏదోవొకటి దీనిసంగతి తేల్చండి ముందు.. నీళ్ళు చూశాక ప్రాణం ఇంకా కొట్టుకులాడుతోంది!

సత్యం వీళ్ళనే చూస్తున్నాడు.. ఉత్సుకతతో...

సుద : నేను ఇంటి యజమానిని... వయసులో పెద్దవాడ్ని కాబట్టి ఈ నీళ్ళు నాకు చెందటం ధర్మం..

మహా : అలా ఎలా కుదుర్తుంది.. నేను ఆడదాన్ని లేడీస్ ఫస్ట్ అంటారు కదా.. అందువల్ల

నాకే చెందాలి..

సచి : నో.. నో.. మీ ఇద్దరి కన్నా చిన్న వాడ్ని కాబట్టి ఆ నీళ్ళు నాకే ఇవ్వాలి.

మహా : అలా అనుకుంటే నీకన్నా చిన్నది చిక్కూ వుంది.

సచి : అదిక్కడ లేదు కదా..

సుద : ముసలి వాళ్ళు చిన్న పిల్లల్తో సమానం కాబట్టి అందరి కన్నా పెద్దా నేనే- అందరి కన్నా చిన్నా నేనే.. అదీకాక జీవితం అంతా మీకోసం కష్టపడ్డాను..

మహా : నేనూ పడ్డాను కష్టం.. నా కష్టంతో పోలిస్తే మీ కష్టం ఏపాటిది.. పిల్లల్ని నవ మాసాలు మోసి కని పెంచింది నేను.. ఇంటెడు చాకిరీ చేసింది నేను.

సచి : మీరేం చేసినా, ఎంత కష్టపడినా మా కోసం, మా భవిష్యత్తు కోసమేగా.. ఇప్పుడూ అలాగే అనుకోండి..

సుద : ఒరేయ్.. పెద్దవాడ్ని... మీకున్నంత శక్తి నాకు లేదు... గుక్కెడు నీళ్ళు గొంతులో పడకపోతే చచ్చిపోతాన్రా.

సచి : నాన్నా.. ఇంకా ఎంతో భవిష్యత్తు వున్న వాడ్ని నేను బ్రతకడం ముఖ్యం.

సుద : సచిత్తూ.. అంటే నేను చచ్చిపోయినా పర్వాలేదనా..

సచి : అలా అన్లేదు.. నేను బ్రతకడం ముఖ్యం అంటున్నాను. వంశం నాన్న.. మన వంశం నిలబడాలంటే నేను బ్రతికుండాలికదా..

సుద : ఇంత వరకూ వొచ్చింది కనుక చెప్తున్నాను నేను బ్రతికి బట్ట కడితే మళ్ళీ పిల్లల్ని కనగలను.

సచి : అంటే నేను చచ్చినా పర్లేదనేగా..

సుద : నేను కుడా అలా అన్లేదు.. నేను బ్రతకడం నాకు ముఖ్యం అంటున్నాను..

మహా : అవునవును.. పిల్లల్ని క నాలంటే ముందు నేను బ్రతికుండాలి కదా..

సుద : అందుకు నువ్వే అక్కర్లేదు

మహా : ఆ మాటే నేనంటే..

సుద : మహాలక్ష్మీ

కొట్టాడు.. షాక్ అయ్యింది-
క్షణకాలం అసహ్యకరమైన నిశ్శబ్దం

తర్వాత.. సుద : మహాలక్ష్మి నన్ను క్షమించు నేను అలా అని వుండకూడదు.

మహా : నేను కూడా అలా మాట్లాడి వుండకూడదు..

సుద : మాట్లాడుతున్నది మనం కాదు.. దాహం దాహం మనచేత మాట్లాడిస్తోంది.

సచి : ఆపండి మీ గోల. దాహంతో చస్తున్నాను నీళ్ళు నేను తాగేస్తాను..

మహా : వొరేయ్.. ఒక్కసారి గుర్తు తెచ్చుకో.. ఆ రోజు చిక్కూ జాంపండు తెస్తే నేను తినకుండా నీకు ఇచ్చాను కదరా.

సచి : నేను తినకుండా నాన్నకిచ్చాను..

సుద : నేను మాత్రం తిన్నానా.. అది నీకివ్వ లేదూ..

సచి : అది జరుగుబాటు వున్నాప్పటి కథ.. అప్పుడు జాంపండు తినకపోయినా ఎవరూ చచ్చిపోరు కాబట్టి అందరం దాన కర్ణులమైపోయాం.. కానీ ఇప్పుడిది చావు బ్రతుకుల సమస్య కాబట్టి కొట్టుకు చస్తున్నాం..

సుద : అదంతా నాకు తెలీదు. నీళ్ళునాక్కావాలి

మహా : నాకే కావాలి.

సచి : మీ ఇద్దర్ని కాదని నేను తాగేస్తే ఏం చెయ్యగలరు?

మహా, సుద : తాగనివ్వం..

సచి : మనలో ఏ ఒక్కరు తాగినా మిగతా ఇద్దరూ వొప్పుకోరు. ఓ పని చేద్దాం.. కట్టకట్టుకుని చద్దాం..

ఏమిటన్నట్టు చూశారు..
కోపావేశంలో తలోపక్కకి వెళ్ళారు.
క్షణం తర్వాత బైట నుండి చిక్కూ వచ్చింది. ముగ్గుర్నీ చూసింది.
వీళ్ళెవరూ చిక్కూ ని గమనించలేదు.
చిక్కూ టీపాయ్ మీద వున్న నీళ్ళ బాటిల్ చూసింది..

చిక్కూ : హాయ్.. నీళ్ళూ..

అంటూ బాటిల్ తీసుకుంది.
ముగ్గురూ చిక్కూని చూసారు..
చిక్కు మెరుపు వేగంతో బైటికి వెళ్ళిపోయింది.. సత్యం చప్పట్లు కొట్టాడు.

సుద : వొరేయ్.. నీళ్ళు ఎత్తుకుపోతోంది.. దాన్ని పట్టుకో..

షాక్‌లో నిలబడిపోయిన సచిత్
బైటికి పరిగెత్తాడు. సుదర్శన్,
మహాలక్ష్మి పరిగెత్తలేక గుమ్మం
దగ్గరే ఆగి పో యారు - సత్యం చప్పట్లు
కొడుతూనే వున్నాడు..

మహా : సత్యం ఆపు నీ గోల

సత్యం నోరు మూసుకున్నాడు.

సుద : గోల కాదే.. సత్యం మనల్ని వెక్కిరిస్తున్నాడు..

మహా : అవునండీ సత్యానికి దాహం వెయ్యదా..

సచి : రావే

చిక్కూని జుట్టు పట్టుకుని లాక్కొచ్చి
లోపలికి విసిరేశాడు.. గది మధ్యలోకి
వచ్చి పడింది చిక్కూ.. చేతిలో వాటర్
బాటిల్ లేదు..

సుద : వాటర్ బాటిల్ ఏదిరా?

అందరూ ఆవేశంతో, కోపంతో
వూగిపోతున్నారు..

సచి : ఇంకెక్కడి వాటర్ బాటిల్.. ఎవడో గద్దలా తన్నుకుపోయాడు..

మహా : పాపిష్టిదానా.. నీక్కావాలంటే తాగి చావచ్చు కదే ఎవరికీ కాకుండా చేశావ్..

కొట్టింది..

చిక్కూ : అమ్మా..

సుద : బైటికెందుకు తీసుకెళ్ళావే..

మహా : చెప్పవే.. అంటే నీకు ఇవ్వకుండా మేం తాగేస్తామని తీసుకెళ్ళావా..

చిక్కూ : కాదమ్మా..

మహా : మరెందుకు తీసుకెళ్ళావే..

సచి : అది అలా చెప్పదమ్మా..

అంటూ బెల్ట్ తీశాడు

చిక్కూ : అన్నయ్యా కొట్టొద్దురా.. చెప్తాన్రా

సచి : చెప్పు బైటికెందుకు తీసుకెళ్ళావ్..

చిక్కూ : చిట్టితల్లి కోసం..

సచి : ఎవరే ఆ చిట్టితల్లి..

చిక్కూ : మనకి రోజూ పువ్వులిస్తుందే అది..

మహా : బోడి పువ్వులిస్తుందని మాకు లేకుండా చేసి దానికి నీళ్ళు తీసుకెళ్తావా..

సుద : అయినా దాని సంగతి వాళ్ళ అమ్మా నాన్న చూసుకుంటారు కదా.. నీకెందుకే

చిక్కూ : చిట్టితల్లి అంటే అమ్మాయి కాదు నాన్నా.. పూలమొక్క..

మహా : ఏంటీ చిట్టితల్లి అంటే పూలమొక్కా!!

చిక్కు : అవునమ్మా.

అంతా ఆశ్చర్యపోయారు..

సత్యం ఎలర్ట్ అయ్యాడు..

సచి : అంటే చిన్న మావయ్య..

చిక్కూ : జామ చెట్టు..

సుద : పెద్ద మావయ్య

చిక్కూ : మామిడి చెట్టు..

మహా : అంటే ఇన్నాళ్ళు నువ్వు చిట్టితల్లి, చిన్న మావయ్యా, పెద్ద మావయ్యా అంటూ వరసలు పెట్టి పిలుస్తున్నది పూలమొక్కల్ని, చెట్లనా..

చిక్కూ : అవునమ్మా..

మహా : ఓసి నీ అఘాయిత్యం కూలా.. ఆ పాడు చెట్ల కోసం...

చిక్కూ : అలా అనకమ్మా.. చెట్లంటే మన పెరట్లో మౌనంగా తపస్సు చేసుకుంటున్న ఋషులమ్మా.. మనం కాసిని నీళ్ళు పోస్తే సంతోషించి మనకి ప్రాణ వాయువునీ, పువ్వుల్నీ, పళ్ళనీ ప్రసాదించే ప్రత్యక్ష దైవాలమ్మా చెట్లు.. వాటిని నిర్లక్ష్యం చెయ్యడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది.. చెట్లు లేకపోతే మనకి కళ్ళల్లో కూడా నీళ్ళుండవమ్మా

సత్యం ఒక్కడే వుద్వేగానికి లోనయ్యాడు..

ఎగశ్వాస వచ్చి మాట్లాడలేకపోయింది.

మహా : అయ్యో ఏమైందే.. చిక్కూ.. చిక్కూ..

సుద : అమ్మా..

సచి : ఏముంది దాహం.. దాహం.. ఎక్కువై వొంట్లో నీరెండిపోయి డీ హైడ్రేషన్ వచ్చినట్టుంది.

మహా : ఆటో పిలు.. ఆస్పత్రికి తీసుకెళ్దాం..

సచి : ఆస్పత్రులు ఎప్పుడో మూత పడ్డాయి.. నీళ్ళు లేక ఆస్పత్రుల్లో సెలైన్ వాటర్ తాగి చాలా మంది చచ్చిపోయారు.

మహా : ఎలారా మరి.. ఏం చేద్దాం..

సచి : చేసేది ఏమీ లేదు.. దీన్ని లోపలికి తీసుకెళ్ళి పడుకోబెట్టు.. నేను ఎలాగైనా నీళ్ళు సంపాదించి తెస్తాను.

చిక్కూని మహాలక్ష్మి లోపలికి తీసుకెళ్ళింది..

వెళుతూ..

సచి : సత్యం నువ్వు కూడా నాతో రా..

గొంతు పీలగా వుంది..

సుద : సత్యం ఎందుకురా..

సచి : సత్యం కూడా ఎక్కడైనా

ప్రయత్నిస్తాడని..

రా సత్యం..

సచిత్, సత్యం వెళ్ళారు.
సుదర్శనం ఏదో అనబోయాడు.
గొంతు పెగల్లేదు... అడుగు
వేయడం కూడా కష్టంగా వుంది.
లోపల్నుండి మహాలక్ష్మి వచ్చింది.

మహా : ఏరి వీళ్ళు.. మంచి నీళ్ళకోసం వెళ్ళారా.
మీరు కూడా వెళ్ళక పోయారా..

సమాధానం చెప్పలేకపోయాడు
సుదర్శనం..

మహా : ఏమండీ మిమ్మల్నే
సుద : ఆ..
మహా : ఏమైందండీ..

దగ్గరకి రమ్మని సైగ చేశాడు..
మహాలక్ష్మి దగ్గరగా వెళ్ళింది.
రెండు చేతుల్తో ఆమె మొహాన్ని
చేతుల్లోకి తీసుకుని పెదవులతో
పెదవుల్ని అందుకోబోయాడు..
విసిరి కొట్టింది..

మహా : ఏమిటండీ.. ఇది.. మీకేమైనా మతి
పోయిందా..

సుద : మతికాదు మహాలక్ష్మి.. ప్రాణం
పోయేట్టుంది. గాలిలో తేమ కూడా
ఆరిపోయినట్టుంది. గొంతుల్లో
గుండెల్లో వొకటే మంట.

మహా : అందరికీ అలాగే వుంది.. మీరు తట్టు
కోలేకపోతున్నారు అంతే.

సుద : అందుకే.. అందుకే.. ఒకసారి నీ
నోటిలో నోరు పెట్టి నాలుకతో తడి
చేసుకుందామని..

మొహం తిప్పుకుంది..

కామంతో అడగడం లేదు మహాలక్ష్మి
దాహంతో అడుగుతున్నాను. ఒక్కసారి
నాలుక తడి చేసుకుంటాను.. పోయే
ప్రాణాలు నిలబెట్టు మహాలక్ష్మి..

మహా : ఏమండీ.. నా నోట్లో వున్న కాస్త తడి
మీకిచ్చేస్తే నేను చచ్చిపోతాను కదండీ..
సుద : మహాలక్ష్మి! అంటే నేను చచ్చినా..
మహా : నాక్కూడా బ్రతకాలని వుందండీ..
అయినా సరే.. నేను చచ్చిపోయినా సరే
ఇస్తాను..

సుదర్శనం సంతోషించాడు..

అయితే మీక్కాదు..
ప్రాణాపాయంలో వున్న చిక్కూకి.. దాన్ని

బ్రతికుంచుకుంటాను..

అంటూ లోపలికి వెళ్ళింది. సుదర్శనం నోట మాట రాలేదు.. బైటికి వెళ్దామని కదిలాడు..

అంతలో లోపల్నుండి..

మహా : అమ్మా.. చిక్కూ

అంటూ గావుకేక పెట్టింది.
కాళ్ళు వొణికి కదల్లేక నిలబడిపోయాడు సుదర్శనం..
లోపలికి వెళ్ళబోయాడు కష్టం మీద చిక్కూని తీసుకుని బైటికి వచ్చింది మహాలక్ష్మి.. చిక్కూ ముక్కు నుండి, చెవుల్లో రక్తం కారుతుంది.

మహా : ఏమండీ.. దీనికి ముక్కుల్లోంచి, చెవుల్లోంచి రక్తం కారుతోందండీ..

సుద : అమ్మా.. చిక్కూ..

మహా : అమ్మా చిక్కూ.. కొంచెం వోర్చుకోమ్మా.. అన్నయ్య నీకోసం నీళ్ళు తెస్తాడు.. నీకేం కాదు..

ఎగ శ్వాసతో వుంది..

సుద : అమ్మా.. చిక్కూ.. నువ్వు ఎప్పుడు బైటికి వెళ్ళినా వెళ్ళొద్దు అని చెప్పలేదు.. ఇప్పుడు అడుగుతున్నాను వెళ్ళిపోవద్దమ్మా.. మమ్మల్ని విడిచి వెళ్ళిపోవద్దమ్మా అమ్మా.. చిక్కూ..

బైట నుండి కేకలు వినబడుతున్నాయి.

ఓబివి : పట్టుకోండి.. పట్టుకోండి.. ఇటే పరిగెత్తాడు..

తల పగిలి రక్తం కారుతున్న స్థితిలో చేతిలో వాటర్ బాటిల్‌తో సచిత్ వచ్చాడు.. వెంట సత్యం కూడా వున్నాడు.

సచి : అమ్మా ఇదిగో నీళ్ళు..

మహా : అయ్యో ఈ రక్తం ఏంట్రా

సుద : ఏమైందిరా..

సచి : నా సంగతి తర్వాత.. ముందు చెల్లాయికి మంచి నీళ్ళు తాగించండి..

అంటూ వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు..

మహా : అమ్మా చిక్కూ.. కొంచెం నోరు తెరు తల్లీ..

చిక్కూ : అమ్మా.. మరి మీకో..

సుద : బాటిల్ నిండా వున్నాయి అమ్మా.. అందరికీ తలో కాస్తా సరిపోతాయి..

ముందు నువ్వు తాగు.

చిక్కూ : అమ్మా ఒక పని చేస్తావా..

మహా : ఏంటి తల్లీ.. ముందు నీళ్ళు తాగవే..

చిక్కూ : అమ్మా.. ఈ నీళ్ళల్లో నా వాటాకి వచ్చే నీళ్ళు చిట్టి తల్లికి అదే పూలమొక్కకి పోయండమ్మా.. పోస్తావు కదూ..

సుద : అలాగే పోస్తాంలే ముందు నువ్వు తాగు.

చిక్కూ : నా కన్నా ముందు మన కన్నా ముందు చెట్లు బ్రతకాలి.. చెట్లని బ్రతికించాలి..

వాటిని బ్రతికిస్తే తరతరాలు మనల్ని

బ్రతికిస్తాయి. నా వాటా నీళ్ళు మొక్కకి పోస్తావు.. క... దూ..

అంటూనే వాలిపోయింది.. అమ్మాయితో పాటు మూర్ఛపోయింది మహాలక్ష్మి.. తీవ్రమైన వుద్వేగానికి లోనయ్యాడు సత్యం.. చిక్కూ దగ్గరికి వచ్చి అతి కష్టం మీద గొంతు పెగల్చుకుని..

సత్యం : నేను సైతం జన్మనొక్కటి ఆహుతిచ్చాను

నేను సైతం వృక్షమై మొలకెత్తుతాను..

నేను సైతం వృక్షమై మొలకెత్తుతాను!

అంటూ సెల్యూట్ చేసాడు చిక్కూకి.. ఎటువంటి భావం లేకుండా చనిపోయిన కూతుర్ని కుప్ప కూలిపోయిన భార్యనీ చూశాడు. సోఫా వంక చూశాడు.. సచిత్ అప్పటికే చనిపోయి వున్నాడని తెలుస్తోంది.
సుదర్శనం మీద స్పాట్‌లైట్ పడింది.
ఘల్లు ఘల్లుమని గజ్జెల శబ్దం -
ఆ వెంటనే స్త్రీ నవ్వు వినబడింది..

ఓబివి : ఓయీ పురుషుడా.. ఏం కావాలి నీకు.. నా ప్రణయాలు కావాలా..
నా ప్రళయాలు కావాలా?

సుద : అమ్మా.. తల్లీ ప్రకృతి మాతా.. అమ్మ పాల లాంటి నీ స్తన్యం కావాలి తల్లీ.. ప్రకృతి మాతా నీ స్తన్యమే నీరని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాం తల్లీ. అమ్మా నీ పట్ల ఎన్నో తప్పులు చేశాం.. కలుషితం చేశాం.. అమ్మా నీ బిడ్డలం.. నువ్వు ఆగ్రహిస్తే బ్రతకలేం.. అనుగ్రహించు మాతా.. దాహం వేస్తోంది తల్లీ.. దాహం తీర్చమ్మా.. మా దాహం తీర్చు తల్లీ..

తల్లీ దాహం.. దాహం తీర్చు తల్లీ..
దాహం తీర్చు తల్లీ..
అమ్మా తల్లీ.. మా దాహం తీర్చు తల్లీ..
అమ్మా దాహం.. దాహం..

నిలువెల్లా ఆవేశంతో వూగిపోతూ..

అంటూ తులసి మొక్కకి నీళ్ళు
పోస్తున్నాడు.. తులసి మొక్కకి నీళ్ళు
పోయగానే ఆకాశంలో మెరుపు
మెరిసింది. ఉరుము వురిమింది
వర్షాగమనాన్ని సూచిస్తూ..
నేపధ్యంలో కొన్ని గొంతులు
శృతిబద్ధంగా వరుణ దేవుడ్ని
ప్రార్థిస్తున్నాయి..

ఓం జల బింబాయ విద్మహే
నీల పురుషాయ ధీమహి
తన్నో వరుణ ప్రచోదయాత్..

వర్షం కురుస్తున్న ధ్వని వినిపిస్తుండగా
స్పాట్‌లైట్ నెమ్మదిగ ఫేడ్ అవుట్
అవుతోంది.

"శుభం"